క్లుప్తంగా

ఆక్రమణదారులకు నోటీసులు

మధురవాడ : విశాఖ రూరల్ మండలం మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 277లో ప్రభుత్వ భూమిలో షెడ్లు నిర్మిస్తున్న వారికి నోటీసులు జారీ చేశామని మధురవాడ జోన్ – 2 టీపీవో వరప్రసాద్ చెప్పారు. మిథిలాపురి వుడా కాలనీ – ఐటీ సెజ్ రోడ్డులో రమ్య ప్యారడైజ్ వద్ద గల సుమారు రూ.5 కోట్ల విలువ చేసే 200 గజాలు ప్రభుత్వ స్థలంలో కొద్ది రోజులుగా ఓ వ్యక్తి షెడ్లు నిర్మిస్తున్నాడు. టీడీపీ నాయకుల అండతో సాగుతున్న ఈ వ్యవహారంపై ఆగని ఆక్రమణలపర్వం శీర్షికతో సాక్షిలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై టీపీవో ప్రసాద్ స్పందించారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వడమే కాకుండా, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయితే ఆక్రమణదారులతో సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలపై మాత్రం ఎవరూ స్పందించడం లేదు. అందరూ మౌనం వహించడంతో అనుమానాలు బలపడుతున్నాయని పలువురు అంటున్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



దెక్కతిపాలెంలో సామూహిక సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు దెక్కతిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమంలో భాగంగా సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపించారు. అనంతరం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఐసీడీఎస్ భీమిలి ప్రాజెక్ట్ పీవో శ్రీదేవి, సూపర్‌వైజర్ ప్రమీల రక్తహీనత, బాల్య వివాహాలపై అవగాహన కలిగించారు. కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, అంగన్‌వాడీలు టి.సత్యకళ, ఎస్.లక్ష్మి, వి.ఆదిలక్ష్మి, కె.సత్యవతి, ఎ.జ్యోతి పాల్గొన్నారు.

డిజిటల్ క్లాస్ ప్రోగ్రాం ప్రారంభం

భీమునిపట్నం : స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద సోమవారం డిజిటల్ క్లాస్ ప్రోగ్రామ్‌ను ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.సింహాచలం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎక్స్‌బీ ట్రస్టు తరఫున పాఠశాలకు ఎల్ఈడీ టీవీ, ల్యాప్‌టాప్, వైఫై సదుపాయాన్ని కల్పించారని తెలిపారు. దీనివల్ల విద్యార్థులకు పాఠ్యాంశాలను చక్కగా బోధించడానికి వీలుంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అల్లాడి శ్రీనివాసరావు, నయీం, వెంకటరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

భీమునిపట్నం: భీమిలిలో సోమవారం సాయంత్రం ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బోయివీధికి చెందిన కొక్కిరి ఎల్లాజీ (22) చేపల వేట సాగిస్తున్నాడు. ఇతనికి గత సంవత్సరం లావణ్య అనే యువతితో వివాహమైంది. వీరికి ఏడు నెలల పాప ఉంది. ఎల్లాజీ అత్తవారి ఇల్లు కూడా ఇదే ప్రాంతంలో ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఇంటిలో ఫ్యాన్‌కు ఎల్లాజీ ఉరి వేసుకున్నాడు. అయితే అప్పటికే ఫోన్ చేసి రమ్మంటే ఎల్లాజీ రాకపోవడంతో అతని బావ ఇంటికి వెళ్లి చూడగా ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే కిందకు దించి దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. ఎస్ఐ పైడిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తగరపువలస : భీమిలి మండలం తాటితూరులో సోమవారం నగరానికి చెందిన మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పతివాడ రాంబాబు, వైద్యులు వెంకటేష్, కల్యాణి పాల్గొన్నారు.

కడలి సంపదతో కడుపు నింపుకునే మత్స్యకారుల జీవనం అత్యంత దుర్భరం. నిత్యం వేటకు వెళ్తేనే గానీ పూట గడవని పరిస్థితి. రెక్కాడితే గానీ డొక్కాడని గంగపుత్రులు వేటకు వెళ్లకపోతే ఆ కుటుంబాలు పస్తులుండాల్సిందే. ఇంతగా కడలి సంపదపై ఆధారపడి బతుకు బండి ఈడుస్తున్న మత్స్యకారులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. వేట విరామ సమయంలో మత్స్యకార భరోసా కింద అర్హులందరికీ రూ.10 వేలు అందించి ఆసరాగా నిలిచారు. నియోజకవర్గంలోని 5,191 మంది లబ్ధిదారులకు రూ.5.19 కోట్లు పంపిణీ చేశారు. లీటర్ డీజిల్‌కు రూ.9 సబ్సిడీ, 50 ఏళ్లకే పింఛన్, వేట సమయంలో ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల నష్టపరిహారం అందించేవారు. గంగపుత్రులకు ఏ చిన్న కష్టం వచ్చినా వెంటనే ఆదుకునే సందర్భాలు అనేకం. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక సహకారం లేకపోవడంతో గంగపుత్రులు విలవిల్లాడుతున్నారు. వేట ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా... విరామం సమయంలో చేసిన అప్పులు తీరక మదనపడుతున్నారు. నేటికీ మత్స్యకార భరోసా అందకపోవడంతో తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రైతు భరోసా, అమ్మ ఒడి పథకాల అమలు మరిచిపోయిందని... మత్స్యకార భరోసాకు కూడా మంగళం పాడినట్టేనని పలువురు నిట్టూర్చుతున్నారు.

మత్స్యకార భరోసాకు మంగళం

- **వేట నిషేధ సమయంలో గంగపుత్రులకు రూ.10 వేలు అందించిన జగన్ సర్కార్**
- **నియోజకవర్గంలోని 5,191 మంది లబ్ధిదారులకు రూ.5.19 కోట్ల పంపిణీ**
- **నేటికీ ఆర్థిక సాయం అందించని కూటమి ప్రభుత్వం**
- **చేసిన అప్పులు తీర్చలేక మత్స్యకారులు విలవిల**

భీమిలి / కొమ్మాది : భీమిలి నియోజకవర్గంలో సుమారు 10 వేలకు పైగా మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. అందరికీ చేపల వేట ప్రధాన జీవనాధారం. భీమిలిలోని తోటవీధి, బోయి వీధి, ఎగువపేట ప్రాంతాల్లో సుమారు 5 వేల మంది మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. వీరిలో సుమారు వెయ్యి మంది చేపల వేటకు వెళ్తుంటారు. ఈ ప్రాంతంలో 200 వరకు బోట్లు ఉన్నాయి. అలాగే చేపలుప్పాడలో 1500, మంగమారిపేట 1000, రుషికొండలో 250, కాపుల దిబ్బడపాలెంలో 70 మంది మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. భీమిలి రూరల్ మండలం అన్నవరం, పెదనాగమయ్య పాలెంలో 200కు పైగా మత్స్యకార కుటుంబాలున్నాయి. తీర ప్రాంతాన్ని ఆనుకొని జీవిస్తున్న వీరికి కుటుంబ పోషణతోపాటు పిల్లలను చదివించుకోవడం భారంగా ఉంటోంది. దీనికితోడు కేంద్ర ప్రభుత్వం ఏటా రెండు నెలలపాటు చేపల వేటకు విరామం ప్రకటిస్తోంది. ఈ సమయంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మత్స్యకార భరోసా పేరిట సాయమందించి ఆదుకుంది.

మత్స్యకారులకు ప్రస్తుతం ఆ సాయం అందక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. బోట్లు, వలలు మరమత్తులు చేసుకనేందుకు అప్పులు చేసుకుంటున్నారు. దానికితోడు గత వారం రోజులుగా వాతావరణం అనుకూలించక సముద్రంలో వేట సాగడం లేదు. దీంతో తమ పరిస్థితి మరింత అధ్వానంగా తయారైందని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా గోడును పాలకులు వినిపించుకోవాలని వేడుకుంటున్నారు.



వలలు, బోట్లకు మరమ్మతులు చేసుకుంటున్న మత్స్యకారులు

సీఎం జగన్ పాలనలో ఆదుకున్నారు



మంగమారిపేటకు చెందిన మాకు మత్స్య వేట జీవనాధారం. ఏటా 45 రోజులపాటు వేటకు విరామం ఉంటుంది. ఆ సమయంలో కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉంటుంది. మా ఇబ్బందులు గుర్తించిన జగనన్న తన పాలనలో అర్హులందరికీ మత్స్యకార **భరోసా పేరిట** రూ.10 వేలు చొప్పున అందించారు. **ఆన్** సీజన్‌లో మాకు అన్నం పెట్టి **ఆదుకున్నారు**. గతంలో టీడీపీ ప్రభుత్వంలో **రూ.4 వేలు** మాత్రమే ఇచ్చేవారు. మళ్లీ **కూటమి ప్రభు**త్వం వచ్చాక మా కష్టాలు మొదలయ్యాయి. నేటికీ భరోసా సాయం అందించలేదు.

– గరికిన నర్సింగ్, మంగమారిపేట

విరామ భృతి అందక అప్పులు



చేపల వేటే మా జీవనాధారం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేట విరామం వచ్చిందంటే ఆందోళనకు గురయ్యేవాళ్లం. ఎక్కడికీ పనికి వెళ్లలేక, వేట లేక తినడానికి కష్టమైన పరిస్థితులు అనుభవించేవాళ్లం. కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉండేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వేట విరామ భృతి రూ.10 వేలకు పెంచడంతో అన్‌సీజన్‌లో కూడా ఆనందంగానే గడిపేవాళ్లం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నేటికీ వేట విరామ భృతి అందించలేదు. దీంతో అప్పులు చేసి వలలు, బోట్లకు మరమ్మతులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– మేరుగు చిన్నారావు, మంగమారిపేట

జగన్ పాలనలోనే ఆర్థిక ప్రయోజనం



చేపల వేటకు విరామం ఇచ్చే సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న అర్హులందరికీ రూ.10 వేలు చొప్పున అందించేవారు. ఇది మాకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. గత ఐదేళ్లు ఏ ఇబ్బందులూ లేకుండా మా జీవనం సాగింది. జాప్యం లేకుండా వేట విరామ సమయాల్లో డబ్బులు అందించి ఆదుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

– వాసుపల్లి రాజు, ఎగువపేట, భీమిలి

ఆర్థికంగా ఇబ్బందులు



టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నేటికీ మత్స్యకార భరోసా అందలేదు. గతంలో సీఎం జగన్ పాలనలో అందించే డబ్బులతో వలలు, పడవలకు మరమ్మతులు చేయించుకోవడంతోపాటు ఇంటి అవసరాలకు ఉపయోగించేవారిమి. ప్రస్తుతం డబ్బులు అందక ఆర్థికంగా చాలా ఇబ్బందిగా వుంది. మత్స్యకార భరోసా అందించి ఆదుకోవాలి.

– గొరస శ్రీను, బోయివీధి, భీమిలి

గతంలో కచ్చితంగా అందించేవారు



గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతీ సంవత్సరం చేపల వేట నిషేధించిన వెంటనే మత్స్యకార భరోసా సొమ్ము కచ్చితంగా అర్హులందరికీ అందించేవారు. దీంతో కుటుంబ పోషణకు ఏ ఇబ్బందీ వుండేది కాదు. వేట విరామ సమయంలో డబ్బులు అందుతాయనే భరోసా వుండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు.

– చింతపల్లి చంద్రయ్య, బోయివీధి, భీమిలి

ప్రభుత్వం వెంటనే స్పందించాలి



మత్స్యకారులందరికీ వేట విరామ భృతి అందించే విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలి. తమను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ... నేటికీ మత్స్యకార భరోసా సొమ్ము అందించలేదు. ఇప్పటికే చాలా ఆలస్యమవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– సురివిన వీర్రాజు, బోయివీధి, భీమిలి

పార్కును పరిరక్షించాలని జెడ్సీకి వినతి

మధురవాడ : ప్రభుత్వ పార్కును పరిరక్షించాలని కొన్నేళ్లుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా చర్యలు చేపట్టడం లేదని బింద్రానగర్ వాసులు సాగర్, తదితరులు ప్రశ్నించారు. సోమవారం మధురవాడ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో జోనల్ కమిషనర్ శైలజావల్లి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా బింద్రానగర్ పార్కులో ఆక్రమణల తొలగింపులో టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జీవీఎంసీ కమిషనర్, కలెక్టర్ సైతం ఆక్రమణలు తొలగించాలని చెప్పినా తాత్సారం చేయడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. జీవీఎంసీ 7వ వార్డులో చాలా చోట్ల వీధిలైట్లు వెలగడం లేదని పిల్లా వెంకటరావు వినతిపత్రం అందజేశారు. బోయిపాలెంలోని జగనన్న కాలనీ, గవర్నమెంట్ హైస్కూల్ పక్కన గల సెరామిక్ కాంక్రీటు బిల్డింగ్ దగ్గర వేస్ట్ మెటీరియల్స్, చెత్త, జంతు కళేబరాలతో ఇబ్బందులు పడుతున్నట్టు చల్లా వెంకట ఆనంద్ తెలిపారు. పీఎం పాలెం బాబానగర్ 4వ నంబర్ రోడ్ వద్ద గల ఖాళీ భూమి, రోడ్డు ఆక్రమణకు కొందరు ప్రయత్నిస్తున్నారని, చర్యలు చేట్టాలని పిల్లా శ్రీనివాసరావు, తదితరులు కోరారు. స్వతంత్రనగర్ పార్కులో సెక్యూరిటీ గార్డును నియమించాలని, లైటింగ్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు జోగేశ్వర పాత్రో, వరలక్ష్మి కోరారు. ఇలా జోన్ పరిధిలోని సమస్యలపై 20 అర్జీలు అందాయని, పరిష్కారానికి చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు.

భీమునిపట్నం : స్థానిక జోనల్ కార్యాలయంలో జెడ్సీ కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు ఆరు వినతులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి నాలుగు, పట్టణ ప్రణాళిక విభాగానికి రెండు వినతులు వచ్చాయని, పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

నవ సమాజ నిర్మాణంలో ఇంజినీర్లదే కీలకపాత్ర

తగరపువలస : నవ సమాజ నిర్మాణంలో ఇంజినీర్లదే కీలకపాత్ర అని చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన ఇండక్షన్ మీట్‌లో వీరు మాట్లాడారు. కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని హితవు పలికారు. తోటి విద్యార్థులతో స్నేహ బంధం ఏర్పాటు చేసుకుని ఆధునిక సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి చెందుతున్న ప్రపంచానికి అనుగుణంగా అధునాతన కంప్యూటర్ కోర్సులు, వాటి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ జె.ఆర్.జి.పట్నాయిక్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం

కొమ్మాది : రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ అర్చకులు ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించి అభిషేకాలు, పూజలు నిర్వహించా రు. టీటీడీ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాక్సుల పంపిణీ

తగరపువలస : ఆనందపురం మండలం పెద్దిపాలేనికి చెందిన చెన్నా కన్వెన్షన్ యజమాని చెన్నా వెంకటేష్ తన తండ్రి ప్రసాదరావు జ్ఞాపకార్థం సోమవారం చిట్టివలస హైస్కూల్ విద్యార్థులకు సాక్సులు పంపిణీ చేశారు. 600 మంది విద్యార్థులకు రూ.15 వేల విలువైన సాక్సులు అందించినట్టు ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్ రావు, చెన్నా వెంకటేష్, మరుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్ప్రింగ్‌ఫీల్డ్ పాఠశాలలో మత బోధన ఆపాలి

- విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్



ఎంఈవో కార్యాలయ ఆపరేటర్ అప్పలకొండకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాలలో మత బోధన ఆపేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్.మహేష్, పి.పవన్ కుమార్, బి.శేషు, ఎం.శ్రీనివాసరావుతోపాటు పలువురు మండల విద్యా శాఖ కార్యాలయ డేటా ఎంట్రీ ఆపరేటర్ అప్పలకొండకు వినతిపత్రం ఇచ్చారు. స్ప్రింగ్ ఫీల్డ్ పబ్లిక్ స్కూల్ క్రిస్టియన్ మిషనరీకి చెందినది కాకపోయినప్పటికీ ఒక సబ్జెక్టుగా క్రిస్టియన్ మతం గురించి విద్యార్థులకు బోధిస్తున్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు మతాన్ని బోధిస్తున్నారని... ఆడ పిల్లలు బొట్టు, పువ్వులు పెట్టుకోవద్దని, గాజులు వేసుకోకూడదని నిబంధనలు విధిస్తున్నారని ఆ వినతిపత్రంలో తెలిపారు. మిగతా మతాల వారి మనోభావాలను దెబ్బతీస్తున్న స్ప్రింగ్ ఫీల్డ్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో ఉత్సాహంగా 'శిక్షా సప్తాహ్'



టీఎల్ఎమ్ మేళాలో తయారు చేసిన వస్తువులతో విద్యార్థులు



బంగ్లామెట్ట పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తగరపువలస: విద్యావిధానంలో నూతన శకానికి నాంది పలుకుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ నూతన విద్యావిధానానికి నాలుగేళ్లు పూర్తయ్యాయని భీమిలి ఎంఈవోలు శివరాణి, జయప్రద అన్నారు. సోమవారం జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడారు. ఈ నెల 29 వరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు విద్యాశాఖ కార్యాచరణ రూపొందించిందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు పిన్నింటి నాగమణి, బుగత మల్లిక, నరహరిశెట్టి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

◆ భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో సర్పంచ్ గాడు వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : మారికవలస ఆర్‌జీకే కాలనీలో గల మండల ప్రాథమిక పాఠశాలలో సోమవారం టీఎల్ఎమ్ మేళా నిర్వహించారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా బోధనోపకరణాలు, విద్యార్థులు సృజనాత్మకతతో తయారు చేసిన వస్తువులతో దీనిని ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు రామకృష్ణ, సత్యనారాయణ, శివకుమార్, రవి, గోవింద్, పద్మజ, రమణ బాబు, శ్రీధర్, కృష్ణవేణి, ఔలియా, జయశ్రీ పాల్గొన్నారు.

భీమునిపట్నం : భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లో సోమవారం శిక్షా సప్తాహ్ వారోత్సవాలను ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు తయారు చేసిన బోధన పరికరాల నమూనాలు, చార్టులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనపై సెమినార్ నిర్వహించారు. అధ్యాపకులు గొట్టేటి రవి, మాణిక్యంనాయుడు, సోమయాజులు, మహాలక్ష్మి, హరిణి, త్రినాథరావు పాల్గొన్నారు. అలాగే పండిట్ నెహ్రూ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు తిరుమల శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు రూపొందించిన నమూనాలను జ్యోతికుమారి పరిశీలించి ప్రశంసించారు.



ర్యాలీలో డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి, ఛాత్రోపాధ్యాయులు

పద్మనాభం : శిక్షా సప్తాహ్‌లో భాగంగా మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధనాభ్యసన సామగ్రిని సోమవారం ప్రదర్శించారు. కృష్ణాపురం, పద్మనాభం, పాత కొవ్వాడ, రౌతులపాలెం, లింగన్నపేట ప్రాథమిక పాఠశాలలు, పద్మనాభం, గంధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్థానికంగా లభించే వనరులతో రకరకాల సామగ్రి తయారు చేసి ప్రదర్శించారు.

విపత్తులపై అవగాహన అవసరం



అవగాహన కార్యక్రమంలో తాటితూరు ప్రజలు

తగరపువలస : భీమిలి మండలం తాటితూరులో ప్రజలకు నగరానికి చెందిన జాతీయ విపత్తుల నిర్వహణ దళం సభ్యులు సోమవారం అవగాహన కల్పించారు. 10వ బెటాలియన్ టీమ్ కమాండర్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, నివారణ చర్యలను వివరించారు. తుఫాన్లు, వరదలు, భూకంపాలు, పిడుగులు పడినప్పుడు, గ్యాస్, విష వాయువులు చిమ్మినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. సీపీఆర్‌పై వివరించారు. కార్యక్రమంలో భీమిలి తహసీల్దార్ టి.గోవింద్, సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు, పతివాడ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యర్థాలతో రుషికొండ బీచ్‌కు స్వాగతం



రుషికొండ బీచ్‌కు కొట్టుకొచ్చిన వ్యర్థాలు

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం, బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పొందిన రుషికొండ బీచ్‌లో పరిశుభ్రత నిర్వహణలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. దేశ, విదేశాల నుంచి రోజుకు వేలాది మంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తుంటారు. ఇప్పటికే ఈ పర్యాటక ప్రాంతంలో కుక్కలు స్వైర విహారం చేస్తూ పర్యాటకులను ఇబ్బంది పెడుతుంటే, మరో వైపు భారీ ఎత్తున వ్యర్థాలు తీరానికి కొట్టుకొచ్చి వెగటు పుట్టిస్తున్నాయి. దీనిపై పులువురు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రుషికొండ బీచ్ నిర్వహణలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

మద్యం దుకాణానికి అనుమతివ్వొద్దు



స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు తగరపువలస ప్రధాన రహదారి గొల్లవీధిలో మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వొద్దని కోరుతూ సీఐటీయూ నాయకులు భీమిలి జోనల్ అధికారులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బందికి సోమవారం వినతిపత్రాలు అందించారు. ఎన్టీఆర్ విగ్రహానికి ఎదురుగా మద్యం దుకాణం ఏర్పాటుకు జరుగుతున్న సన్నాహాలను విరమించుకోవాలని కోరారు. ఈ ప్రాంతంలో మద్యం దుకాణం వల్ల గతంలో మహిళలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఆర్.ఎస్.ఎన్.మూర్తి, నీలాతి రాము, దువ్వి రమణ, కంచుమాని నరసింగరావు, బి.సంతోషి, ఎస్.కొండమ్మ, డి.కృష్ణవేణి వినతిపత్రాలు అందించారు.

నీటి మాఫియాపై ఫిర్యాదు

మహారాణిపేట : జీవీఎంసీ 4వ వార్డులోని కాపులుప్పాడ, తిమ్మాపురం ప్రాంతాల్లో అనధికారికంగా బోర్లు తవ్వి నీటి మాఫియా నిర్వహిస్తున్న వారిపై ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టకపోవడంపై ఆర్టీఏ కార్యకర్త శరత్ ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు మరోసారి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. కాపులుప్పాడలో దుంప నరసింహమూర్తి, ఎరుసు అప్పలకొండ రెడ్డి, తిమ్మాపురంలోని విజ్ఞాన్ స్కూల్ రోడ్డులో గోపాల్, బుజ్జి, లక్ష్మణ్ అనే వ్యక్తులు వాటర్ మాఫియా నడిపిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినప్పటికీ మౌనం వహించడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు చేపట్టాలని కోరారు.

బొడ్డపాలెం పారిశ్రామికవాడలో తనిఖీలు

తగరపువలస : ఆనందపురం మండలం బొడ్డపాలెం పారిశ్రామికవాడలోని పరిశ్రమల్లో మూడు రోజులుగా జీఎస్టీ, కార్మికశాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిశ్రమలో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిసింది. తనిఖీలపై అధికారులు స్థానికంగా సమాచారం ఇవ్వడం లేదు. తనిఖీలు పూర్తయిన తర్వాత వివరాలు నగరంలోని ప్రధాన కార్యాలయాల ద్వారా తెలియచేయనున్నట్టు తెలిపారు. పూర్తి సమాచారం తెలియాల్సి వుంది.

బాబా సన్నిధిలో అన్నసమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మధురవాడ : స్వతంత్రనగర్ పోర్టు కాలనీ సమీపంలోని సాయిబాబా గుడిలో గురు పౌర్ణమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా రెండో రోజైన సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పోర్టు కాలనీ, మధురవాడ, గణేష్ నగర్, నగరంపాలెం పరిసర ప్రాంతాల భక్తులు ప్రసాదం స్వీకరించారు. ఆలయ ధర్మకర్త కప్పా రఘుమణి, తదితరులు పాల్గొన్నారు.